క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: అమెరికాకు చెందిన పరసా షీలాబన్నీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆమె తండ్రి విశ్రాంత ప్రాసిక్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఉన్నం ఏహేజ్కేలు, మాజీ సర్పంచ్ ఉన్నం షకీలా దంపతుల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, పినపాటి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సంకా శ్రీధర్ సేవలు చిరస్మరణీయం



తెనాలిటౌన్: ప్రముఖ న్యాయవాది సంకా శ్రీధర్ సేవలు చిరస్మరణీయమని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమ నిర్వాహకులు, గాంధీ హృదయదారి వజ్రాల రామలింగాచారి పేర్కొన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో శుక్రవారం న్యాయవాది సంకా శ్రీధర్ 20వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పాల్గొని శ్రీధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ ట్రస్ట్ బోర్డుమెంబర్‌గా శ్రీధర్ సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆశ్రమవాసులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంకా సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



తెనాలి: ఎస్సీ వర్గీకరణపై నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కుప్పం నుంచి ఇచ్ఛాపురం చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర శుక్రవారం సాయంత్రం తెనాలి చేరుకుంది. ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు తులిమిల్లి అశోక్ బాబు, చెన్న కేశవులు ఆగస్టు 3వ తేదీన కుప్పం –ఇచ్ఛాపురం యాత్రను చేపట్టారు. వీరి పాదయాత్ర తెనాలి చేరుకోగా, స్థానిక మార్కెట్ యార్డు వద్ద దళిత, ప్రజాసంఘాలు ఘనంగా స్వాగతం పలికాయి. అక్కడ్నుంచి ర్యాలీగా తోడ్కొని అయితానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను పరిగణలోకి తీసుకోకుండా ఉన్న రిజర్వేషన్లను రాజకీయ స్వార్థం కోసం కులలుగా విడతీయటాన్ని వ్యతిరేకిస్తున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో తెనాలి దళిత, ప్రజాసంఘాల నాయకులు బోనిగల ప్రదీప్, బొనిగల ప్రవీణ్, వంపుగాని గురవయ్య, జూపూడి జాన్సన్, మన్నవ ప్రభాకర్, బోరుగడ్డ జాకబ్, పాండుగల చైతన్య పాల్గొన్నారు.

దేవికారాణికి సాహితీ సత్కారం



తెనాలి: తెనాలికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, ప్రముఖ కవయిత్రి కొలకలూరి దేవికారాణి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సాహితీ సత్కారం అందుకున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కమిటీ సంయుక్త నిర్వహణలో విజయవాడలో శుక్రవారం జరిగిన గురు పూజోత్సవంలో ఈ గౌరవాన్ని అందుకున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఎమ్మెల్సీ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ఈ సత్కారం చేశారు. ఉపాధ్యాయినిగా, కవయిత్రిగా దేవికారాణి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

ప్రత్తిపాడు విద్యుత్ ఏఈగా సాంబశివరావు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం విద్యుత్ శాఖ ఏఈగా ధర్మవరపు సాంబశివరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న గౌతమ్‌ను భట్టిప్రోలు మండలానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో గుంటూరు డీ–7 సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సాంబశివరావును ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, సబ్‌స్టేషన్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

తెనాలికి జ్వరమొచ్చింది

- అర్బన్ హెల్త్ సెంటర్‌లలో పూర్తి స్థాయిలో అందని వైద్య సేవలు.
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



జ్వరపీడితులతో నిండిన మెడికల్ వార్డు

తెనాలిఅర్బన్: డివిజన్‌లో జ్వరాలు ఇప్పుడిప్పుడే ప్రబలుతున్నాయి. ఇటీవల తరచు వర్షాలు పడుతుండటంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీంతో ఎక్కువగా జలుబు, దగ్గుతో పాటు జ్వరాలు వస్తున్నాయి. రోజురోజు వీరి సంఖ్య పెరుగుతుండటంతో అందరిలో ఆందోళన నెలకొంటోంది. తెనాలి పట్టణంలో ఒక జిల్లా వైద్యశాల, ఆరు అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. జిల్లా వైద్యశాలలో జ్వరపీడితులు 15 నుంచి 20 మంది ప్రతిరోజు వచ్చి చికిత్స పొందుతున్నారు. వీరిలో అయిదుగురు ప్రతిరోజు ఇన్ పేషెంట్‌లు చేరుతున్నారు. అలాగే ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రతిరోజు జ్వరపీడితులు 15 నుంచి 20 మంది వరకు వచ్చి చికిత్స పొందుతున్నారు. అంటే తెనాలి పట్టణంలో సగటున 140 మంది వరకు జ్వర పీడితులు ప్రతిరోజు చికిత్స పొందుతున్నారు. వీరు కాకుండా జలుబు, దగ్గు, వంటి వ్యాధులతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇలాంటి రోగులు తెనాలి జిల్లా వైద్యశాలలో 20 మంది వరకు వస్తున్నారు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కూడా ప్రతిరోజు 20 మంది వరకు వచ్చి చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు.

నిండిపోతున్న వార్డులు

తెనాలి జిల్లా వైద్యశాలలోని మెడికల్ వార్డులు జ్వరపీడితులతో నిండిపోతోంది. చికిత్సకు అవసరమైన మందులను కూడా దాదాపు అందుబాటులో ఉంచారు. అలాగే జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధునీకరించటం వల్ల దాదాపు అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేసే సదుపాయం వచ్చింది. అన్ని రకాల పరీక్షలు చేస్తుండటం, దానిని 24 గంటలు పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవటంతో ఎక్కువ మంది ఉపయోగించుకుంటున్నారు. అయితే టెస్ట్ రిపోర్టులు మరుసటి రోజు స్తుండటం వల్ల రోగులు కొంత ఇబ్బంది పడుతున్నారు. అదే రోజు రిపోర్ట్‌లు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే చాలా వరకు పేద ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

సమస్యల వలయంలో అర్బన్ హెల్త్ సెంటర్లు

తెనాలి పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో నామమత్రపు పరీక్షలు చేసి సరిపుచ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీటి అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించలేదు.



జిల్లావైద్యశాలలో ఓపీ వద్ద రోగుల రద్దీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వసతులే నేటికి కొనసాగుతున్నాయి. కనీసం ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్ట్‌లను కూడా భర్తీ చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. దీంతో కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఇన్‌చార్జిలుగా ప్రభుత్వ వైద్యులను నియమించాల్సి వస్తోంది. దీంతో పేదలకు కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్య సేవలు కూడా అందని పరిస్థితి ఏర్పడుతుంది. జర్వాలు ప్రబలుతున్న నేపథ్యంలో పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అర్బన్ హెల్త్ సెంటర్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అప్రమత్తంగా ఉండండి



తరచు వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇప్పుడిప్పుడే జ్వరాల సంఖ్య పెరుగుతుంది. జ్వర పీడితులకు అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాం. జిల్లా వైద్యశాలలో ఆధునిక ల్యాబ్ ఉంది. దీనిలో అన్ని రకాల పరీక్షలు చేస్తారు. అవసరమైన వారు అక్కడికి వెళ్లి చికిత్స పొందాలి. అలాగే వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలి.

–డాక్టర్ ఈ.అన్నపూర్ణ,
డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, తెనాలి

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

కొల్లిపర: ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డు లో అందిస్తున్న క్యూ ఆర్ కోడ్‌ను స్కానింగ్ ద్వారా లబ్ధిదారులు ఎప్పుడు ఎక్కడ రేషన్ తీసుకున్నారు అన్న అంశాలు స్వయంగా తెలుసుకోవచ్చు అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ మండల పరిధిలో 18,441 మందికి కార్డులు ఇంటింటికి సచివాలయం సిబ్బంది వెళ్లి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.కొల్లిపర గ్రామంలో 4214 మందికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మండలంలోని 20గ్రామాలకుగాను నూతనంగా 859 మందికి రేషన్ కార్డులు మంజూరు, చేయటం జరిగిదన్నారు.అనంతరం మూడో విడత ఉచిత గ్యాస్ బుకింగ్ ద్వారా వచ్చిన గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.సిద్దార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఎంపీపీ పద్మావతి, సర్పంచ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరణ



తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బోసురోడ్డులోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, తదితర సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చారు. వాటిని పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల పాత్ర మరువరానిది

తెనాలిఅర్బన్: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువరానిదని అధ్యాపకులు డాక్టర్ ఎ.గంగాధరరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలోని ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే ప్రతి మాటను విద్యార్థులు ఆచారణలోపెడితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అలాగే వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఈ.షీలా, ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్ ప్రకాష్, డాక్టర్ నన్నపనేని సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

+ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ప్రకాశం రోడ్డులో నిర్వహించారు. ఎన్‌సీఆర్ స్కూల్ ఉపాధ్యాయరాలు ఆర్.సంపూర్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ళ వెంకట కృష్ణమోహనరావు, వ్యవస్థాపకుడు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యం, ట్రెజరర్ డాక్టర్ కడియాల పల్లవి, కార్యదర్శి సాతులూరి రాంప్రసాద్, కిక్కురి చిన్నకృష్ణారెడ్డి, పాదర్తి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సంపూర్ణను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు



డాక్టర్ సర్వేపల్లి చిత్రానికి నివాళి అర్పిస్తూ...

గుర్రం జాషువా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో..

తెనాలి: పట్టణానికి చెందిన గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం జరిపారు. భారత రాష్ట్రపతిగా చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. డాక్టర్ రాధాకృష్ణ జన్మదినం రోజున గురుపూజోత్సవం జరుపుకోవటం ఉపాధ్యాయులకు గర్వకారణమని గుర్రం జాషువా విజ్ఞానసమితి అధ్యక్షుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పినపాటి రవికుమార్ అన్నారు. కటారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యను బోధించే గురువు బాధ్యత గురుతరమైనదని డాక్టర్ రాధాకృష్ణ చెప్పారని గుర్తుచేశారు. మాజీ అడిషనల్ ఏపీపీ ఇందుపల్లి రాజారామ్, షేక్ అమర్‌జన్, కొండముది రమేష్, వేజెండ్ల రత్నం, రావూరి పాల్‌రాజ్, పేటేటి డేవిడ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గణేష్ మహోత్సవాలు

తెనాలి: చినరావూరులో గణేష్ మహోత్సవాలను వైభవంగా నిర్వహించిన సందర్భంగా వివిధ సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన నిర్వాహకులు అభినందనీయులని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.నరేంద్ర అన్నారు. కపూర్ ఫ్రెండ్స్ సర్కిల్, బంజారాల కులగురువు సంతు సేవాలాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17వ గణేష్ ఉత్సవాలు గురువారం రాత్రితో ముగిశాయి. పూజల అనంతరం లడ్డూ వేలంపాట నిర్వహించి, ఊరేగింపుగా స్వామివారిని నిమజ్జనం చేశారు. ట్రస్ట్ తరపున ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన కె.చంద్రశేఖర నాయక్‌కు 10 వేలు, ప్రతిభావంతురాలైన జ్యోతి అనే విద్యార్థినికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నరేంద్ర, మెడికల్ విద్యార్థి చంద్రశేఖరనాయక్‌ను, ట్రస్ట్‌ను స్థాపించిన లక్ష్మణ్‌ను అభినందించారు. 12వ వార్డు కౌన్సిలర్ కొర్ర యశోద మాట్లాడుతూ తమ కులగురువైన సంతు సేవాలాల్ పేరిట ఏర్పాటైన ట్రస్ట్ పేద, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కపూర్, లక్ష్మణ్, లక్ష్మి, స్వామినాయక్, ప్రశాంత్ నాయక్, బాలస్వామి నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

తెనాలి సహకార అర్బన్ బ్యాంక్ చైర్మన్ పోటీ లేనట్టే

కేంద్రమంత్రి పెమ్మసాని సమక్షంలో చర్చలతో పోటీనుంచి గుమ్మడి రమేష్ విరమణ

తెనాలి: పట్టణంలోని తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవిపై పోటీకి తెరపడింది. ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంగమూరి హరిప్రసాద్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఇదే పదవికి పోటీపడుతున్నట్టు ప్రకటించిన గుమ్మడి రమేష్ పోటీ నుంచి విరమించుకున్నారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మంగమూరి హరిప్రసాద్, గుమ్మడి రమేష్‌తో మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ఒకే ఒక ప్యానల్ ఉండాలని, పోటీ ప్యానల్ ఉండేందుకు వీల్లేదని ఈ సందర్భంగా పెమ్మసాని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతోపాటు గుమ్మడి రమేష్‌కు భవిష్యత్‌లో ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్సీ ఆలపాటి హామీనిచ్చారు. చర్చల అనంతరం పోటీ నుంచి విరమించుకుంటానని రమేష్ వెల్లడించారు. వీరితో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రాంబాబు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పదవులు అలంకారం కాదు

మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ సీపీలో పదవులు అలంకారం కాదనీ, ప్రజలకు ఉపయోగపడుతూ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగినవని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీలో వివిధ విభాగాల్లో నియోజకవర్గ స్థాయి పదవులు పొందిన పార్టీ నాయకులు శుక్రవారం గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉన్నవ అనీష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోర్ల శ్రీను, నియోజకవర్గ వలంటరీ విభాగం అధ్యక్షుడు దూరు రత్నబాబు, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు పఠాన్ అసద్‌లు మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారిని అభినందించిన శివకుమార్, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటప్పారెడ్డి, పార్టీ నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, వంగా సుధాకరరెడ్డి, కుర్రా జస్వంత యాదవ్, అక్కిదాసు కిరణ్‌కుమార్, నిట్టా బాలు, షేక్ రబ్బానీ, కె.నాగమల్లేశ్వరరావు, బోరుగడ్డ బాబ్జి, పిల్లి గంగాధర్, కనపర్తి ప్రకాష్, పినపాటి రవికిరణ్, బండ్లమూడి నాని, జ్యోతుల సుధీర్, నాలాది ప్రభాకర్ పాల్గొన్నారు.



కొత్తగా పదవులు పొందిన నాయకులతో శివకుమార్

సంగీత నాటక అకాడమీ డైరెక్టర్ శాస్త్రికి సత్కారం

తెనాలి: రాష్ట్ర సంగీత నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన తెనాలికి చెందిన మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకర శాస్త్రిని బ్రాహ్మణ సేవాసమితి శుక్రవారం సాయంత్రం ఘనంగా సత్కరించింది. సేవాసమితి ప్రధాన కార్యదర్శిగా కూడా అయిన శాస్త్రి అభినందన సభను స్థానిక రామలింగేశ్వరపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. సేవాసమితి అధ్యక్షులు కొమ్మమూరి కాశీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ, రాజకీయంగా బ్రాహ్మణ్యానికి తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌కు బ్రాహ్మణ సేవా సమితి తరపున ధన్యవాదాలు తెలియ చేశారు. అతి త్వరలో మాగంటి శాస్త్రి గారికి తెనాలిలోని బ్రాహ్మణ ప్రముఖుల ఆధ్వర్యంలో భారీ సన్మాన సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇదే వేదికపై ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ హిందీ టీచర్ కరవది సరస్వతిని సేవా సమితి ఘనంగా సత్కరించింది. సేవా సమితి తరపున గుమ్మడి రవీంద్రబాబును, డైరెక్టర్ మాగంటి శాస్త్రి ఘనంగా సన్మానించారు. సేవాసమితి గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, సలహాదారు త్రిపురారిభట్ల దత్తు, ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, విష్ణుభట్ల మణి కిషోర్, తూములూరు రాజా ఫణీంద్ర, కార్యవర్గ సభ్యులు అద్దేపల్లి మాధవ శాస్త్రి, దావులూరి శ్యాం సుందర్ శర్మ, లక్కరాజు లక్ష్మణరావు, కొమ్మమూరు కీర్తి తదితరులు పాల్గొన్నారు. తోలుత పోతావఝుల పురుషోత్తమ శర్మ స్వాగతం పలుకగా, మన్నెపల్లి ఆదిశేషగిరిరావు వందన సమర్పణ చేశారు.



రత్నాకర శాస్త్రి దంపతులకు సత్కారం

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

పెదకాకాని: గంజాయి ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శుక్రవారం పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని జాన్‌హాస్పరస్ కాలనీలోని ఓ ఇంటిలో గంజాయి చిన్న చిన్న ప్యాకెట్లు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితుల్లో నలుగురు మైనర్లు ఉండటం విశేషం. నిందితులు విశాఖపట్నం ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చినట్లు సమాచారం. నిందితులు పెదకాకాని జ్యోతినగర్, అంబేడ్కర్‌నగర్, జాన్‌హాస్పరస్ కాలనీ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించారు. సాలపోగు చిన్ని, వేగి సూరిబాబుతో పాటు మరో నలుగురు మైనర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి.నారాయణస్వామి తెలిపారు.

పాలస్తీనాకు అండగా నిలవండి

లక్ష్మీపురం: భారతదేశంలో కూడా గతంలో అలీన విధానాన్ని అనుసరించి పాలస్తీ నాకు అండగా ఉన్నటువంటి వారసత్వాన్ని భవిష్యత్‌లో కొనసాగించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ అన్నారు. పాత గుంటూరు కింగ్ హోటల్ వద్ద ప్రోగ్రెసివ్ ఫోరం గుంటూరు ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ శాంతియుత నిరసన కార్యక్రమం శుక్రవారం ముస్లిం సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు, ఉలెమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 22 నెలలుగా అమెరికన్ సామ్రాజ్య అండతో ఇజ్రాయిల్, పాలస్తీనా, గాజా మీద చేస్తున్న దాడులకు సుమారు 70 వేల మంది పిల్లలు మహిళలతో సహా మృతి చెందారని, లక్షలాదిమంది క్షతగాత్రులు అవడం జరిగిందన్నారు. అంతర్జాతీయ సమాజం ఖండించినప్పటికీ ఐక్యరాజ్యసమితిలో పలు దఫాల తీర్మానాలు చేసినా పట్టించుకోకుండా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సామ్రాజ్యవాద కాంక్షతో జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా కులం, మతం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆవాజ్ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టీ మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాదం ఏ సంక్షోభాలను పరిష్కరింపజాలదని సోషలిస్టు వ్యవస్థ మాత్రమే పరిష్కరించగలదని అన్నారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే అమెరికన్ ఏక ధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం వైపుగా అడుగులు వేస్తుందన్నారు. ముఫ్తి బాసీద్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి నెలకొల్పాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందన్నారు.



సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలి



పెదకాకాని: ప్రజల తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్న చెరువు కట్టలకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత నెల కురిసిన భారీ వర్షాలకు మంచినీటి చెరువు, మురుగు నీటి చెరువుకు మధ్యలో గల కట్ట తెగినందున మంచినీటి చెరువులో మురుగునీరు చేరి నీరు కలుషితం అయిందన్నారు. దీంతో ఆ నీరు తాగే వీలు లేకుండా పోయిందని చెరువులో ఉన్న మురుగునీటిని తొలగించి చెరువును ఎండబెట్టి తరువాత మరలా నింపాలని శివాజీ డిమాండ్ చేశారు. గతంలో చెరువు కట్ట పనులు నాసిరకంగా జరిగినందు వలన వర్షానికి కట్ట తెగిపోయిందని, రెండు నెలలుగా గ్రామంలో మంచినీరు సరిగా రావడం లేదన్నారు. మురుగునీరు వస్తున్నందున గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. గత ఏడాది కూడా చెరువు కట్టకు గండి పడిందని, దీనిక శాశ్వత పరిష్కార పనులు చేపట్టాలన్నారు. నీరు కలుషితం అయినా పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా చెరువులో ఉన్న మురుగునీరు బయటకి పంపించి మంచినీటితో నింపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఎస్ నీలాంబరం, బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

పెదకాకాని: జాతీయ ఉపాధ్యాయ దినోత్స వం సందర్భంగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో యానాదికాలనీలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ జరిగింది. డాక్టర్ కొండలరావు మా ట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిల్లల్ని బడికి పంపించాలని, విద్య ద్వారానే జీవితాల్లో వెలుగులు చేకూరతాయన్నారు. ప్రొఫెసర్ రామచంద్రన్ ఆర్థిక సహకారంతో నంబూరు గ్రామంలోని యా నాది కాలనీలో పిల్లలకు అల్పాహారం, పెద్దలు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈమని ప్రతాపరెడ్డి, తులాబంధుల తాతయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.